2023 సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం ׀ 1 ׀ జనవరి ׀ 2023

గరిష్టం/కనిష్టం 32.0 /20.0

వాతావరణం

రోజులో అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చలి తీవ్రత తక్కువగానే ఉండే అవకాశం ఉంది.



కల్వకుర్తిలో కేక్ కట్ చేస్తున్న పట్టణవాసులు

న్యూస్‌రీల్

శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన శనేశ్వరాలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన సంవత్సరం నుంచి తమకు శనిదోషం నివారణ కావాలని పూజలు చేశారు. డిసెంబర్ 31 కావడంతో భక్తులు ప్రత్యేకంగా శనైశ్వరుడిని దర్శించుకుని సంప్రదాయ పద్ధతిలో తిలతైలాభిషేక పూజలు, మంత్రోచ్ఛరణ చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, అర్చకులు శాంత కుమార్, ఉమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిరప పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన

తాడూరు: రైతులు సాగు చేసిన మిరప పంటలో పూతను ఆశించే కొత్తరకం తామర పురుగు సమగ్ర యాజమాన్యం, వేసవిలో టమాట సాగుపై శనివారం మండలంలోని గుంతకోడూరులో కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ శంకర్, ఉద్యాన అధికారి డాక్టర్ మహేశ్వరి హాజరై మిరప సాగును పరిశీలించి పంటను ప్రస్తుత కాలంలో ఆశించే కీటకాలు, పురుగు గురించి వివరించారు. వాటి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. మిరపలో పూత దశలో ఆశించే కొత్తరకం తామర పురుగు, వేసవి కాలం టమాట సాగు గురించి రైతులకు అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. మిరప పంటలో కొత్తరకం తామర పురుగు నియంత్రణ కోసం సమీకృత యాజమాన్యం పద్ధతులను తెలియజేశారు. తామర పురుగు నుంచి నిరోధకతను పెంపొందించడానికి మొక్కలకు సరిపడా పొటాష్ ఎరువు అందించాలి. మిరపను ప్రధానంగా పొలంలో నాటడానికి 3 నుంచి 4 వారాల ముందు పంట చుట్టూ 2 నుంచి 3 వరుసల పొడవుగా పెరిగే జొన్న, మొక్కజొన్న, సజ్జ, పశుగ్రాస గడ్డి దట్టంగా విత్తాలి. చివరి అస్త్రంగా ఉద్యాన అధికారిని సంప్రదించి తగిన క్రిమిసంహారకాలను అవసరమైన మేరకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సాయిరమేశ్, ఏఈఓ చంద్రప్రకాశ్, రైతులు వెంకటయ్య, శ్రీశైలం, ఎల్లయ్య, బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొంగొత్త ఆశలతో..



జిల్లా కేంద్రంలో నూతన సంవత్సరం సందర్భంగా బెలూన్లతో ముస్తాబు చేసిన దుకాణాలు

- నూతన సంవత్సరంలో మొదలు కానున్న జాతీయ రహదారి పనులు
- పూర్తికానున్న నూతన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం
- గోపాల్‌దిన్నె లింక్ కెనాల్ పనుల వేగంపై ఆశలు
- రానున్న రోజుల్లో పర్యాటకానికి కొత్త పుంతలు

సాక్షి, నాగర్‌కర్నూల్: నూతన సంవత్సరంలో జిల్లాలో కొంగొత్త మార్పులు చోటుచేసుకోనున్నాయి. పలు అభివృద్ధి పనులు పూర్తికానున్నాయి. మరికొన్ని ప్రారంభం కానున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల పనులు ఊపందుకోనుండగా.. నూతన కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభం కానుంది. జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు అచ్చంపేటలోని వంద పడకల ఆస్పత్రి భవనం ప్రజలకు అందుబాటులోకి రానుంది. కొల్లాపూర్‌వాసుల చిరకాల కలగా ఉన్న సోమశిల- సిద్దేశ్వరం వంతెన నిర్మాణంతో పాటు కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు నిర్మించే జాతీయ రహదారి 167 కె నిర్మాణ పనులు కొత్త ఏడాదిలోనే ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం చేపట్టిన పనుల్లో వేగంతోపాటు మరిన్ని కొత్త పనులతో జిల్లా రూపురేఖలు మారనున్నాయని జిల్లావాసులు భావిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై..

నూతన సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనులపై జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. బిజినేపల్లి మండలంలోని 22 గ్రామాల పరిధిలోని రైతులకు నీరందించే మార్కండేయ ప్రాజెక్టు పనులకు అవసరమైన భూసేకరణ ఈ ఏడాదిలో పూర్తయ్యి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అచ్చంపేట నియోజకవర్గంలోని ఎత్తైన ప్రాంతాలకు సాగునీరు అందించే ఉమామహేశ్వర, చెన్నకేశవ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని బల్మూర్ మండలం మైలారం వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి బల్మూరు, లింగాల, అచ్చంపేట మండలాలకు సాగునీరు అందనుంది. ఈ ఎత్తిపోతల ద్వారా సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. చెన్నకేశవ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా నీటిని అచ్చంపేట మండలంలోని చంద్రసాగర్ చెరువుతో పాటు మన్ననూర్ వద్ద నిర్మించే రిజర్వాయర్‌కు తరలించనున్నారు. దీంతో కాల్వల ద్వారా అమ్రాబాద్, పదర మండలాల్లోని సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలు కల్గనుంది. ఈ ఏడాదిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కొల్లాపూర్ నియోజకవర్గంలోని సింగోటం – గోపాల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు ఈ ఏడాదిలో పూర్తిచేసే అవకాశం ఉంది.

జాతీయ రహదారితో కొత్త రూపు..

జిల్లా మీదుగా సాగనున్న 167కె జాతీయ రహదారి పనులు కొత్త సంవత్సరంలో ఊపందుకోనున్నాయి. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు నిర్మించే జాతీయ రహదారితో పాటు సోమశిల వద్ద నిర్మించనున్న వంతెన నిర్మాణంతో ఇక్కడి ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయి. ఇప్పటికే వంతెనతో పాటు రహదారి నిర్మాణానికి నిధులు ప్రారంభంకాగా.. కొత్త ఏడాదిలో బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. సింగోటం లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే రూ.15 కోట్లు కేటాయించగా.. ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులు నూతన ఏడాదిలో ప్రారంభంకానున్నాయి.

సుఖసంతోషాలతో గడపాలి..



నూతన సంవత్సరంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో అభివృద్ధి పథంలో పయనించాలి. జిల్లాలో మంచి పంటలు పండి, పారిశ్రామికపరంగా విద్యాపరంగా మంచి అభివృద్ధిని సాధించాలి. రాష్ట్ర ప్రభుత్వం చాలా నోటిఫికేషన్లు జారీ చేసినందున నిరుద్యోగ యువత కష్టపడి చదివి అత్యధిక ఉద్యోగాలు సాధించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందేలా కృషి చేస్తా. రాబోయే రోజుల్లో కరోనా మహమ్మారిని తరిమికొట్టేలా మాస్క్ ధరించాలి.

– ఉదయ్‌కుమార్, కలెక్టర్

మరింత ఉత్తేజంతో పనిచేస్తాం...



జిల్లా ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు కొత్త సంవత్సరంలో మరింత ఉత్తేజంతో పోలీస్‌శాఖ విధులు నిర్వర్తిస్తోంది. 2023 సంవత్సరంలో నేరాల నియంత్రణకు సాంకేతికత మరింత పటిష్టంగా వినియోగించుకుంటాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసులు పనిచేస్తారు. నూతన సంవత్సరంలో యువత చెడు వ్యసనాలను త్యజించి ఉన్నతంగా ఎదిగేందుకు కృషిచేయాలి. జిల్లా ప్రజలందరి జీవితాల్లో కొత్త ఏడాది వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాం.

– మనోహర్, ఎస్పీ

సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి..



నూతన ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో 2022లో ఒక వైపు జిల్లా, మరో వైపు రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించి, వృద్ధిలో ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచింది. అదే స్ఫూర్తితో ఈ ఏడాది ముందుకు సాగాలి.

– మర్రి జనార్దన్ రెడ్డి, నాగర్‌కర్నూల్, ఎమ్మెల్యే

విద్య, వైద్యానికి ప్రాధాన్యం..



కొత్త ఏడాదిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో చేర్చేందుకు నావంతుగా కృషి చేస్తా. ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నా. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సదుపాయాల కల్పనకు కృషిచేస్తా.

– శాంతాకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం



2023 సంవత్సరంలో కొల్లాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతాం. అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దాదాపుగా రూ.20 కోట్లు స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. పెండింగ్‌లోని పనులన్నింటిని పూర్తిచేసేందుకు ముందుకు సాగుతాం.

– రాజయ్య, మున్సిపల్ కమిషనర్

పర్యాటకానికి కొత్త రంగులు..

జిల్లాకు ఆనుకొని ఉన్న కృష్ణా తీరంతో పాటు నల్లమల ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. నల్లమలలో సఫారీని విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు అటవీశాఖ ఇప్పటికే ఎనిమిది కొత్త వాహనాలను కొనుగోలు చేసింది. ఈ వాహనాలు ఈ ఏడాదిలో అందుబాటులోకి రానున్నాయి. జిల్లా పరిధిలోని ఈగలపెంట నుంచి శ్రీశైలానికి రోప్‌వే నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిలోనే చేపట్టనుంది.

సుస్వాగతం 2023

కందనూలు: జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా నూతన సంవత్సరం జోష్ కనిపించింది. కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు జిల్లావాసులు అర్ధరాత్రి రోడ్లపైకి, వీధుల్లోకి వచ్చి టపాకాయలు కాల్చి, కేక్‌లు కట్‌చేశారు. పరిసర గ్రామాల నుంచి యువతీ, యువకులు పట్టణాలకు తరలిరావడంతో జిల్లా కేంద్రంతో పాటు కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ ముఖ్య పట్టణాల్లోని బేకరీలు, స్వీట్ హౌస్‌లు, చికెన్, మటన్ సెంటర్లు శనివారం కిక్కిరిసిపోయాయి. మహిళలు తమ రంగులు కొనుగోలు చేస్తూ.. బిజీగా కనిపించారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగానే కొత్త డిజైన్లలో కేకులు తయారు చేశారు. యాజమానులు తమ షాపులను బెలూన్స్, మిరమిట్లు గొల్పె లైట్లతో అందంగా ముస్తాబు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు రంగవల్లికలు వేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. జిల్లాలోని వైన్స్‌ల వద్ద ప్రజలు పెద్దసంఖ్యలో మందు కొనుగోలు చేయడానికి రావడంతో వైన్స్‌ల ముందు బారులు కనిపించాయి.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రంగవళికలు వేస్తున్న విద్యార్థినులు



కొనుగోలుకు సిద్ధంగా ఉంచిన కలర్లు



జిల్లా కేంద్రంలోని బేకరీల్లో కేక్‌లు

విరబూసిన పూత

- ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఊరిస్తున్న మామిడి
- వాతావరణం అనుకూలిస్తే అధిక దిగుబడులు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న ఉద్యాన అధికారులు
- కొల్లాపూర్ మార్కెట్‌యార్డులోనే కొనుగోళ్లు

కొల్లాపూర్: మూడేళ్లుగా నామమాత్రపు దిగుబడి వచ్చిన మామిడి పంట ఈ సారి రైతులను ఊరిస్తోంది. మామిడి పూతలు ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా విరబూశాయి. మొదటి, రెండో పూతలు బాగా కాయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాండూస్ తుఫాన్ మినహాయించి, వాతావరణంలో పెద్దగా మార్పులు లేకపోవడంతో మామిడి పంటపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా సాగు..

నాగర్‌కర్నూల్ జిల్లాలో 34,712 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. మూడేళ్ల కిందట మామిడి సాగు జిల్లా వ్యాప్తంగా 25,931 ఎకరాలు మాత్రమే ఉండేది. ప్రతి సంవత్సరం మూడు వేల ఎకరాల మేరకు సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో కలిపి 9 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుండగా.. కొల్లాపూర్ నియోజకవర్గంలో అధికంగా 25 వేల ఎకరాలకు పైగా మామిడి సాగు జరుగుతోంది. ఎకరాకు రెండున్నర మెట్రిక్ టన్నుల నుంచి మూడు మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

నవంబర్ నుంచి పూత..

ఈ ఏడాది కొంచెం ముందుగానే పూతలు ప్రారంభమయ్యాయి. నవంబర్‌లో వచ్చిన మొదటి పూతతో పాటు, డిసెంబర్ నెలలో వచ్చిన రెండో పూత కూడా బాగా పూశాయి. మూడేళ్ల కాలంలో పెద్దమొత్తంలో ఈసారి మామిడి పూతలు పూయడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూతలు ఇలాగే నిలిచి ఉంటే మామిడి దిగుబడి ఈ సంవత్సరం భారీగా పెరిగే అవకాశం ఉంది.

వాతావరణం అనుకూలంగా ఉంటే..

మామిడి పంటకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాలి. చలికాలంలో తేమ, చల్లటి గాలులు అధికంగా ఉంటే పూతకు పురుగు ఆశించి నష్టం చేకూరుస్తుంది. అయితే మాండూస్ తుఫాన్ కారణంగా వారం రోజులు చల్లటి వాతావరణం నెలకొంది. వర్షం, చలితీవ్రత కారణంగా కొంతమేరకు పూత మాడిపోయింది. అయితే తర్వాత వచ్చిన పూతకు ఎటువంటి సమస్యలు లేకపోవడంతో మామిడి తోటలు కళకళలాడుతున్నాయి. వాతావరణం ఇలాగే అనుకూలిస్తే మామిడి దిగుబడులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు.



మామిడి తోటలు

సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	మామిడి సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	దిగుబడి అంచనా మెట్రిక్ టన్నుల్లో
అచ్చంపేట	622	2,418	9,672
కల్వకుర్తి	1,084	4,547	18,188
కొల్లాపూర్	11,981	25,237	1,00,946
నాగర్‌కర్నూల్	771	2,510	10,042
మొత్తం	14,458	34,712	1,38,848



మామిడి పూత

సస్యరక్షణ చేపట్టాలి



మామిడికి అధికంగా తేనెమంచు, బంక, బూడిద తెగుళ్ల వ్యాప్తి చెందుతూ ఉంటాయి. వీటికి సస్యరక్షణ చర్యలు చేపడితే మెరుగైన దిగుబడి సాధించవచ్చు. ఈ సీజన్‌లో మాండూస్ తుఫాన్ కారణంగా వారం రోజులు మినహాయిస్తే మిగతా రోజుల్లో మామిడి పంటకు అనుకూలమైన వాతావరణం నెలకొంది. వాతావరణంలో మార్పులు లేకుంటే పంట బాగా వచ్చే అవకాశం ఉంది.

– లక్ష్మణ్, ఉద్యాన అధికారి, కొల్లాపూర్

వ్యాపారులతో చర్చలు..



మామిడి మార్కెట్ నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి రూ.5.45 కోట్లు మంజూరు చేయించారు. పనులు చేపట్టడంలో ఆలస్యమైతే కొల్లాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోనే మామిడి కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులతో చర్చలు జరుపుతున్నాం. గతేడాది కంటే ఈసారి ఎక్కువ సంఖ్యలో వ్యాపారులను కొల్లాపూర్‌కు తీసుకొచ్చి కొనుగోళ్లు పెరిగేలా చూస్తాం.

– కిషన్‌నాయక్, మార్కెట్ చైర్మన్, కొల్లాపూర్

యార్డులోనే కొనుగోళ్లు....

కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటు కోసం స్థలాన్ని గుర్తించారు. అయితే ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం మామిడి మార్కెట్ నిర్మాణ పనుల కోసం రూ.5.45 కోట్లు మంజూరు చేసింది. వచ్చే సీజన్‌నాటికి మార్కెట్ ఏర్పాటు చేసే అవకాశాలు తక్కువగా ఉండటంతో కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్‌యార్డులోనే మామిడి కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ సంఖ్యలో వ్యాపారులను కొల్లాపూర్‌కు రప్పించి కొనుగోళ్లు పెంచేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

రేపు ఉత్తర ద్వార వైకుంఠ దర్శనం

కందనూలు: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని రామాలయంలో స్వామి, అమ్మవార్ల వైకుంఠ ఉత్తర ద్వార దర్శనంతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు శ్రీగోదా రంగనాయక స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో ఆలయ ఆవరణలోని మాడ వీధుల వెంట భాజాభజంత్రీలతో పల్లకీసేవ ఉంటుందన్నారు. రామాలయ మహిళా కోలాట బృందం వారిచే ప్రత్యేక ప్రదర్శనలతో కోలాటాలతో పల్లకీసేవ, ఐదు గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్తర ద్వార దర్శనం, 6 గంటలకు గోదాదేవి మాతకు తిరుప్పావై, సేవా కాలం, పాశురం పఠనం, 6.30 గంటలకు ప్రత్యేకంగా విష్ణు సహస్ర పారాయణ పఠనం, 7 గంటలకు ప్రత్యేక సామూహిక భజనలు, అనంతరం స్వామి అమ్మవార్లకు నివేదించిన ప్రత్యేక తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలియజేశారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పెద్దకొత్తపల్లి: మండలంలోని నారాయణపల్లిలో శనివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్ జెండాను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. నారాయణపల్లి సర్పంచ్ కళమ్మతో పాటు మరో 50మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, శ్రీనివాసులు, రాముయాదవ్, గణేశ్‌రావు, ధర్మారెడ్డి, ప్రేమ్‌రాజారావు, ఎంపిటిసిలు వెంకటస్వామి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

అభివృద్ధికి రూ.100 కోట్లు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట: నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.200 కోట్ల నిధులు మంజూరు చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నా కతంలో ప్రాణం ఉన్నంత వరకు నల్లమల అభివృద్ధికి పరితపిస్తానే తప్ప.. తప్పుడు పనులు చేయనని, రూ.100 కోట్లకు అమ్ముడుపోయే నైజాం నాది కాదన్నారు. మహిళలకు బీఆర్ఎస్ పార్టీ తగిన ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామంలో మహిళా కమిటీలు వేస్తామన్నారు. రైతుబంధు జిల్లా అధ్యక్షుడు పోకల మనోహర్, మార్కెట్ చైర్మన్ అరుణ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, వైస్ చైర్మన్ పోరెడ్డి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు ఘన సన్మానం

లింగాల: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆయన్ను పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మహిళా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

ఉప్పునుంతల: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని శ్రద్ధతో చదువుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాబోధన, మౌలిక వసతులు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



లింగాలలో ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ హనుమంతురెడ్డి

ఈ కొత్త సంవత్సరం వేళ మీ అందరి జీవితాలలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు కలగాలని కోరుకుంటూ... **నూతన సంవత్సర శుభాకాంక్షలు** Happy New Year 2023

Su	Mo	Tu	We	Th	Fr	Sa
January						
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31	1	2	3	4

Su	Mo	Tu	We	Th	Fr	Sa
February						
29	30	31	1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	1	2	3	4

Su	Mo	Tu	We	Th	Fr	Sa
March						
26	27	28	1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	31	1

Su	Mo	Tu	We	Th	Fr	Sa
April						
26	27	28	29	30	31	1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

Su	Mo	Tu	We	Th	Fr	Sa
May						
30	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30	31	1	2	3

Su	Mo	Tu	We	Th	Fr	Sa
June						
28	29	30	31	1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	1

Su	Mo	Tu	We	Th	Fr	Sa
July						
25	26	27	28	29	30	1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

Su	Mo	Tu	We	Th	Fr	Sa
August						
30	31	1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30	31	1	2

Su	Mo	Tu	We	Th	Fr	Sa
September						
27	28	29	30	31	1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30

Su	Mo	Tu	We	Th	Fr	Sa
October						
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31	1	2	3	4

Su	Mo	Tu	We	Th	Fr	Sa
November						
29	30	31	1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	1	2

Su	Mo	Tu	We	Th	Fr	Sa
December						
26	27	28	29	30	1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30

ఆర్థికసాయం అందజేత

అమ్రాబాద్: పురుటినొప్పులతో ప్రభుత్వ వైద్యం అందక మృతిచెందిన మండలంలోని వెల్మపల్లికి చెందిన స్వర్ణ కుటుంబానికి శనివారం బీజేపీ నాయకులు రూ.5వేల నగదు, 25 కేజీల బియ్యంను అందజేశారు.

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు

ఉప్పునుంతల: స్థానిక బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో శనివారం విద్యార్థులు 2022 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2023 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించారు.

లింగాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నూతన సంవత్సర సంబురాలను నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, కేక్‌లను పంచారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం సంబురాలు నిర్వహించారు.





తాడూరు ఉన్నత పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉప్పునుంతలలో కేక్‌ను కట్ చేస్తున్న విద్యార్థులు

అభ్యర్థులకు న్యాయం చేయాలి

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులకు న్యాయం చేసే వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహమాన్ అన్నారు. శనివారం ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కల్వకుర్తి: పోలీస్ నియామకాల్లో నిబంధనలను మార్చి నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కృష్ణాజీ మాట్లాడుతూ ప్రజల పక్షాల సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు.

తెలకపల్లి: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పనిచేస్తుందని జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూర్యశంకర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో వార్షికోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు.

పంటల పరిశీలన

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని మల్కాపూర్, గగ్గలపల్లి, మంతటి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న యాసంగి పంటలను వ్యవసాయ విస్తరణాధికారులు సంతోష్, నర్మద పరిశీలించారు. అర్హులు ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లికి చెందిన చంద్రకంటి బీసమ్మ ఫిర్యాదు మేరకు అక్రమంగా భూమి పట్టా చేయించుకున్నదనే ఆరోపణలపై ఆమె ఆడపడచు మన్ననూర్‌కు చెందిన చిన్ననాగమ్మపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. చనిపోయిన తన భర్త చంద్రకంటి బాలమశయ్య, తన మామ రాములుపై మామిళ్లపల్లి శివారులో ఉన్న 10 ఎకరాల భూమిని అక్రమంగా తన ఆడపడచు పట్టా చేయించుకుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

కల్వకుర్తి టౌన్: కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, వాటిని ఆచరణలో పెట్టడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని విద్యార్థులకు సూచించారు.

సామర్థ్యాల పరిశీలన

తాడూరు: మండలంలోని గుంతకోడూరు, తాడూరు, పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈఓ భాస్కర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తొలిమెట్టు శిక్షణలో నేర్చుకున్న విషయాలను అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

త్రీవీలర్ వాహనం వితరణ

తెలకపల్లి: మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యాసంస్థలోని డిగ్రీ కళాశాల విద్యార్థి పవన్‌కుమార్‌కు త్రీవీలర్ వాహనాన్ని అందజేసినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చొరవతో ఆయన చారిటబుల్ ట్రస్టు ద్వారా త్రీవీలర్ మంజూరు చేయించారన్నారు.

పౌరహక్కులపై అవగాహన

ఉప్పునుంతల: మండలంలోని జప్తీసదగోడులో తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను సహించేది లేదు

కందనూలు: అయ్యప్ప స్వామిపై ఓయూ విద్యార్థి బైరి నరేష్ అనుచిత వ్యాఖ్యలపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి శనివారం ఖండించారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని అన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై సాయంత్రం రెండుబైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. చెర్కూర్‌కు చెందిన అలియోథిన్, ఆయన కుమార్తె సోనిలు ద్విచక్రవాహనం వెల్దండ వైపు వెళ్తున్నారు. జానలగట్టుతండాకు చెందిన తావుర్యానాయక్ వెల్దండ నుంచి మెకానిక్ షాప్‌వైపు వెళ్తుండగా, రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో అలియోథిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడింది. చికిత్స నిమిత్తం యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. తావుర్యనాయక్ కాళ్లకు, తలకు గాయలయ్యాయి.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న భక్తబృంద సభ్యులు

కొల్లాపూర్: హిందూ దేవుళ్ల, అయ్యప్పస్వామి గురించి అనుచితంగా వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌తో పాటు, ఆయనకు మద్దతుగా ఉన్నవారిని శిక్షించాలని మాదవస్వామి దేవాలయ భక్తబృంద కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఉదయం ఆలయంలో ధనుర్మాస పూజల అనంతరం భక్తులు ఆలయం వెలుపల నిరసన తెలిపారు.

పెద్దకొత్తపల్లి: హిందూ దేవుళ్లను అవమానపరుస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అయ్యప్ప భక్తులు మండల కేంద్రంలో నిరసన తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంలో అయ్యప్ప భక్తులు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు ధర్నా నిర్వహించారు. గంటకు పైగా ధర్నా నిర్వహించడం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి.

తెలకపల్లి: అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని హిందూవాదులు అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

మండల కమిటీ ఎన్నిక

బిజినేపల్లి: మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ల నూతన అధ్యక్షుడిగా నాగరాజును శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా పర్వతాలు, ఉపాధ్యక్షుడిగా మధుబాబు, ఎండీ అమీర్‌బాబు, గంగారం మల్లయ్య పలువురిని ఎన్నుకున్నారు.

చదువుతోనే భవిత

కల్వకుర్తి: చదువుతోనే ఉజ్వల భవిత సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని గిరిజన పాఠశాలకు రూ.50వేల విలువ గల సౌండ్ సిస్టంను ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లింగాల: మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు మెంబర్ బల్లారి కృష్ణయ్య అనారోగ్యంతో మృతిచెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రవాణారంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రామయ్య డిమాండ్ చేశారు.

స్పీకర్ల వితరణ

తాడూరు: మండలంలోని అల్లాపూర్ పాఠశాలకు సత్యసాయిబాబ సేవా సమితి సభ్యుడు రాఘవేందర్ శనివారం స్పీకర్లను అందజేశారు. సత్యసాయిబాబ సేవా సమితి ద్వారా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని, అల్లాపూర్‌తో పాటు మేడిపూర్ గ్రామాల పాఠశాల విద్యార్థులకు సేవా సమితి ద్వారా ఉదయం అల్పాహార కార్యక్రమాలు అందిందామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మోహన్ సాగర్ పాల్గొన్నారు.

మైకుసెట్టు వితరణ

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ గురుకుల పాఠశాలకు మున్సిపల్ చైర్మన్ సత్యం రూ.50వేల విలువగల మైకుసెట్ వితరణ చేశారు. శనివారం పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి చారిటబుల్ ట్రస్టు నుంచి వాటిని అందజేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన వెంకటయ్య వ్యవసాయ పొలంలో శనివారం కాడెద్దు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారు. గోపాలమిత్ర మల్లేష్ పరిశీలించి నివేదికను అధికారులకు అందజేస్తామని అన్నారు.

నేటి తరంతో అంతరాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తా



ఒక తల్లిగా, ఒక పోలీస్ అధికారిగా నా ఆలోచనా విధానానికి నేటి తరంతో నాకున్న అంతరాన్ని తగ్గించుకునేలా ప్రయత్నించాలనుకుంటున్నాను. నేటి తరం ఆలోచనలను అర్థం చేసుకుంటూ వారి అభివృద్ధికి తగిన సూచనలు ఇస్తూ ఒక తల్లిగా ముందుకు వెళ్లాలనుకుంటున్నాను. చట్టం పరిధిలో మరింత చేరువయ్యేలా పనిచేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటాను.

– సుమతి, మహిళా భద్రత విభాగం డీఐజీ

కొత్త ఏడాదిలో ప్రాజెక్టులు పూర్తవ్వాలి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా ప్రాజెక్టులను కొత్త ఏడాదిలోనైనా పూర్తి చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలి

సీఎం జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఇంటిలో ఆనందాలను నింపాలని, మంచి ఆరోగ్యం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం తన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు.



క్లుప్తంగా...

కాంగ్రెస్ నేతలకు కొత్త బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో పని విభజన జరిగింది. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న ఏడుగురికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొత్త ఏడాదిలో కొత్త బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ మల్లు రవి (సమన్వయం, నిర్వహణ), జి.నిరంజన్ (ఎన్నికల కమిషన్), టి.కుమార్‌రావు (కార్యక్రమాలు, సమాచారం), వేం నరేందర్‌రెడ్డి (సంస్థాగతం, డీసీసీలు, మండల కాంగ్రెస్ కమిటీలతో సమన్వయం), హెచ్.వేణుగోపాల్‌రావు (ప్రొటోకాల్, సంస్థాగత శిక్షణ), ఎస్.జగదీశ్వర్‌రావు (ఏఐసీసీ కార్యక్రమాల సమన్వయం), చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కమ్యూనికేషన్స్, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, బీమా)లకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్ర అప్పులకు వడ్డీలు జనాలు కట్టాల్నా?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అప్పులకు వడ్డీలు జనాలు కట్టాల్నా అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. 'ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ' అన్నట్లుంది రాష్ట్ర పరిస్థితి అని ఆమె ట్వీట్ చేశారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్ర ఆదాయం కిస్తీలకే మిగలట్లేదన్నారు. రాష్ట్రం సిద్ధించిన నాటికి సంపద 16వేల కోట్లుకాగా.. ఇప్పుడు అప్పు 4.50 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఎనిమిదిన్నరేళ్లుగా చేసిన అప్పులకు కట్టిన వడ్డీ లక్ష కోట్లని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చడం దుర్మార్గమని, ఇంత అప్పు చేసినా జనానికి ఒరిగింది మాత్రంసున్నా అని షర్మిల విమర్శించారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేశానని.. ఇక బంగారు భారత్ చేస్తానంటూ దేశాన్ని దోచుకోవడానికి పోతున్నాడని షర్మిల ఆరోపించారు.

ప్రజలకు షర్మిల నూతన సంవత్సర శుభాకాంక్షలు.. రాష్ట్ర ప్రజలకు వైఎస్ షర్మిల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రజల జీవితాల్లో మరింతగా వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. 2023 ఎన్నికల ఏడాదని, కేసీఆర్ నీచ, నికృష్ట, నియంత, అవినీతి, అరాచక పాలనకు స్వస్తి పలికే సంవత్సరమన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు బీజేపీ పాలక్‌లు

- తమకు కేటాయించిన సీట్లలో పార్టీ నిర్దేశం ప్రకారం కార్యక్రమాలు
- బూత్ కమిటీల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు, మండల కమిటీలతో భేటీలు
- 7న బూత్ కమిటీలను ఉద్దేశించి వర్చువల్‌గా జేపీ నడ్డా ప్రసంగం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు ఆ పార్టీ జాతీయ నాయకత్వం పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంస్థాగతంగా పార్టీ బలోపేతంతో పాటు, మెజారిటీ సీట్లలో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసేందుకు డిసెంబర్ 29న నాలుగంచెల వ్యవస్థను ప్రకటించింది. ఈ వ్యవస్థలో పార్టీకి పూర్తి సమయమిచ్చి పని చేసే ఫుల్‌టైమర్ 'విస్తారక్'తో పాటు కన్వీనర్, ప్రభారీ (ఇన్‌చార్జి), పాలక్‌లను నియమించారు. పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత, రాజకీయ సలహాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని అన్ని రకాల వనరుల సమీకరణ బాధ్యతలను 'పాలక్'లకు అప్పగించారు. శనివారం కొందరు నాయకులు తమకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలు తీసుకుని పనిచేయడం ప్రారంభించారు. తమకు బాధ్యతలు అప్పగించిన సీట్లలో ఎన్నికలు ముగిసేదాకా ప్రతీనెల మూడురోజుల పాటు పూర్తి సమయమిచ్చి పనిచేయాలనే నిబంధను జాతీయ నాయకత్వం విధించింది. దీంతో నాయకులు ఆయా అసెంబ్లీసీట్లలోని పరిస్థితుల అధ్యయనంలో నిమగ్నమయ్యారు.

వర్చువల్ కుదరకపోతే వీడియో సందేశం..

ఇదిలా ఉంటే జనవరి 7న 119 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో బూత్ కమిటీలు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. ఒకవేళ సమయాభావం వల్ల నడ్డా వర్చువల్‌గా ప్రసంగించే అవకాశం లేకపోతే వీడియో రికార్డింగ్ ద్వారా ఆయన సందేశం వినిపించనున్నట్లు పార్టీవర్గాల సమాచారం. పాలక్‌లుగా నియమితులైన వారిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు ఉన్నారు. జనవరి మొదటివారంలో, ముఖ్యంగా 5,6,7 తేదీల్లో వీరంతా పాలక్‌లుగా ఆయా నియోజకవర్గాల్లో పని ప్రారంభించనున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి కిషన్‌రెడ్డి, మేడ్చల్‌కుడా.కె.లక్ష్మణ్, కుత్బుల్లాపూర్‌కు డీకే అరుణ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఇంద్రసేనారెడ్డి, పటాన్‌చెరువు–పి.మురళీధర్‌రావు, వరంగల్ తూర్పు– ఈటల రాజేందర్, మెదక్–ధర్మపురి అర్వింద్, చేవెళ్ల–ఏపీ జితేందర్‌రెడ్డి, జుక్కల్–జి.వివేక్ వెంకటస్వామి, ఎల్లారెడ్డి–రఘునందన్‌రావు, జూబ్లీహిల్స్–కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్–కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, పరిగి–విజయశాంతి, ములుగు–సోయం బాపూరావు, రాజేంద్రనగర్–మర్రి శశిధర్‌రెడ్డి, కల్వకుర్తి–ఎన్.రామచంద్రరావు నియమితులైన విషయం తెలిసిందే. వీరంతా అసెంబ్లీ పాలక్‌లుగా తమకు అప్పగించిన విధుల నిర్వహణలో భాగంగా బూత్ కమిటీల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు, మండల కమిటీ అధ్యక్షులతో భేటీలు నిర్వహించనున్నారు. జనవరి 7వ తేదీలోగా సంస్థాగతంగా అన్ని కమిటీల నియామకంపై కార్యాచరణ అమలు చేయనున్నారు.

పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వండి


- సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ
- క్వింటాలుకు రూ.15 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: పత్తి పంటకు మద్దతు ధర కావాలని రైతులు రోడ్డెక్కితే ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని, విపత్కర పరిస్థితుల్లో ఉన్న రైతుల సమస్యలను ప్రభుత్వమే పట్టించుకోకుంటే రైతులు ఎవరికి చెప్పుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. వానలు, చీడపీడల బెడదను తట్టుకుని, పండిన పత్తిని చూసిన రైతన్న ఆనందం, మార్కెట్‌లో ధర చూడగానే ఆవిరైపోతోందని, దళారుల రాజ్యంలో గిట్టుబాట ధర రాక రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి పెట్టిన పెట్టుబడిని పరిగణనలోకి తీసుకుంటే కనీసం రూ.15 వేలు క్వింటాలుకు వస్తేకానీ రైతుకు గిట్టుబాటు కాని పరిస్థితి ఉందని, కానీ దళారులు కేవలం రూ.6–7 వేలు మాత్రమే చెల్లించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సరైన వ్యవసాయ విధానం, పంటల ప్రణాళిక లేకపోవడం, దిశానిర్దేశం చేసే వ్యవస్థలు కుంటుపడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రేవంత్ పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ రుణ ప్రణాళికలు సరిగా అమలు చేయకపోవడం, విత్తనాలు, పురుగు మందుల సరఫరా చేయలేకపోవడం, ప్రకృతి విపత్తుల సమయంలో భరోసా ఇవ్వలేకపోవడం, తెగుళ్ల సోకి పంట నష్టం జరిగినప్పుడు పరిహారానికి భరోసా లేకపోవడం వంటి అనేక కారణాలు రాష్ట్రంలో వ్యవసాయాన్ని, రైతును సంక్షోభంలో పడేశాయని విమర్శించారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సగటున రోజుకు ఇద్దరు అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడుతున్నారని, రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉందని జాతీయ క్రైం బ్యూరో (ఎన్సీఆర్బీ) లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం రైతుల ఆత్మహత్యల సంక్షోభంపై దృష్టి సారించాల్సిన అవసరం సూచించారు. అయితే తూతూ మంత్రపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని అన్నారు. పత్తికి క్వింటాలుకు రూ.15 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, తక్షణమే రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాల ప్రైవేటు అప్పులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిష్కరించేలా ప్రభుత్వ వ్యవస్థలు చొరవ తీసుకోవాలని, కౌలు రైతులకు కూడా అన్ని పథకాలను వర్తింపజేయాలని, పంటల బీమా పథకాల అమలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో రేవంత్‌రెడ్డి కోరారు.

2022లో సర్కారు రైతుల ఉసురుపోసుకుంది

- ప్రజాకోర్టులో టీఆర్‌ఎస్‌కు శిక్ష తప్పదు: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: సొంత రాష్ట్రంలోని ప్రజాసమస్యలు తీర్చకుండా సెంటిమెంట్‌గా పుట్టిన టీఆర్‌ఎస్ పేరు మార్చి ఢిల్లీ వెళ్లాలనుకుంటున్న సీఎం కేసీఆర్ ప్రయత్నాన్ని ఎవరూ హర్షించబోరని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. ఇంట గెలవకుండా రచ్చ గెలవాలనుకోవడం అత్యాశే అవుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంచాయతీరాజ్ సంఘటన్ వైస్ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుధీర్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుందని, రైతులు, రైతు కూలీలకు ఇబ్బందినామ సంవత్సరంగా మిగిలిపోయిందని చెప్పారు. కేసీఆర్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత 7,098 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కనీసం ఆ కుటుంబాలకు పరిహారం కూడా ఇవ్వలేదని అన్నారు.

జనవరి 2న సర్పంచుల ధర్నా

గ్రామపంచాయతీలకు వచ్చే అన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాల కోసం దారి మళ్లిస్తోందని రాచమల్ల సిద్దేశ్వర్ ఆరోపించారు. రాష్ట్రంలోని 12,750 గ్రామపంచాయతీలకు నాలుగైదు నెలలుగా ఇవ్వాల్సిన రూ.1,250 కోట్ల రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెప్రగతి పేరుతో సర్పంచ్‌లను అప్పులపాలు చేశారని అన్నారు. స్థానిక సంస్థల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఈనెల 2న ఇందిరాపార్కు వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపోడికి కల్యాణలక్ష్మి చెక్కు ఇవ్వనంటావా?

బాజిరెడ్డిపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆగ్రహం



దుబ్బాక టౌన్: 'ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్న బాజిరెడ్డి గోవర్దన్ సభలో బీజేపోడు కల్యాణలక్ష్మి చెక్కు కోసం వస్తే ఇవ్వలేదని, అంత సంస్కారహీనంగా మాట్లాడుతున్నా, వేదికమీద ఉన్న మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి నోరు మెదపకపోవడం సిగ్గుచేటని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. శనివారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల, మతాలకు అతీతంగా వ్యవహరిస్తానని బాజిరెడ్డి గోవర్దన్ భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. కేంద్రం కూడా అదే విధానం అవలంబిస్తే తెలంగాణకు అన్యాయం జరగదా అని మంత్రులను ప్రశ్నించారు.

మద్దతు ధర పెంపుపై కేంద్రాన్ని ప్రశ్నించవా?

రేవంత్.. ధర నిర్ణయం కేంద్ర పరిధి అని తెలియదా?: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ధాన్యం కొనమంటే ముఖం చాటేసిన కేంద్రం గురించి పల్లెత్తు మాట అనని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం మీద బురదజల్లడం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయంగా వేరైనా ఈ రాష్ట్రం బిడ్డగా రేవంత్ ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని, బీజేపీతో ఉన్న లోపాయికారి ఒప్పందం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ పత్తి గిట్టుబాటు ధర రాష్ట్రం పరిధిలో ఉంటుందా? కేంద్రం పరిధిలో ఉంటుందా? అనే విషయం కూడా తెలీదా అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇటీవల పత్తి మద్దతు ధర, రైతుల సమస్యలపై సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి రాసిన లేఖపై నిరంజన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ గిట్టుబాటు ధర గురించి కేంద్రాన్ని ప్రశ్నించకుండా సీఎంకు లేఖ రాయడంలో రేవంత్‌రెడ్డి ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మద్దతు ధరల విషయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తానని మాటతప్పిన ప్రధాని మోదీని, బీజేపీని ఎప్పుడైనా నిలదీశావా? అని అడిగారు.

రూ.లక్ష నగదు దగ్ధం



పాన్‌గల్: ఓ రైతుకు చెందిన లక్ష రూపాయలు నగదు కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఆ వివరాలు... బాధిత రైతు మరాఠి నర్సింహ వరి ధాన్యం విక్రయించగా వచ్చిన రూ.1.80 లక్షలు వచ్చాయి. దీంతో ఇంట్లో దాచాడు. శనివారం పొలానికి వెళ్లాడు. అప్పు ఇచ్చిన వ్యక్తికి డబ్బులు ఇచ్చేందుకు ఇంట్లో రూ.లక్ష తీసుకుని రావాలని భార్య రాములమ్మకు చెప్పాడు. భోజనంతోపాటు డబ్బులను కూడా ఆమె తీసుకెళ్లింది. పొలంలో ఓచోట భోజనాలను ఉంచి తాగునీరు తెచ్చేందుకు వెళ్లింది. పొలం సమీపంలో కొయ్యలకు నిప్పంటించారు. అవి భోజనాల వరకు వ్యాపించాయి. ఈ క్రమంలోనే కవరులో ఉంచిన నగదులో రూ.60వేలు పూర్తిగా, రూ.40వేలు పాక్షికంగా (70 శాతం) కాలిపోయాయి. దీంతో అప్పు ఎలా తీర్చాలంటూ రైతు కన్నీరుమున్నీరయ్యాడు.

నూతన డీజీపీకి ఎస్పీ శుభాకాంక్షలు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర డీజీపీగా నూతనంగా నియామకమై బాధ్యతలు చేపట్టిన అంజనీ కుమార్‌ను శనివారం హైదరాబాద్‌లో ఎస్పీ వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





మహబూబ్‌నగర్‌లో కొనుగోలుదారులతో కిక్కిరిసిన బేకరీ



జేపీఎన్‌సీఈ కళాశాలలో విద్యార్థినుల కేరింత

సందడే సందడి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. శనివారం రాత్రి నుంచే యువత వేడుకల్లో మునిగితేలారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా సంబరాలు చేసుకున్నారు. కేకుల కోసం బేకరీలకు క్యూ కట్టారు. కొందరు యువత ప్రత్యేకంగా విందులు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ప్రత్యేకంగా డీజేలు ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో కేకులు కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కొల్లాపూర్‌లో కేక్ కట్ చేస్తూ..



నారాయణపేటలో కేకులు కొనుగోలు చేస్తూ..

పరుగులో తడబాటు



పరుగు ప్రారంభం చేస్తున్న ఏఎస్పీ రాములు



షాట్‌పుట్ వేస్తున్న యువకుడు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 8నుంచి నిర్వహిస్తున్న ఎస్‌ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల ఈ నెల 3తో ముగియనున్నాయి. కాగా మరోసారి 1,600 మీటర్ల పరుగు పోటీలో అభ్యర్థుల తబడాటు కొనసాగుతుంది. శనివారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో మొత్తం 1,467మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1,342 మంది హాజరుకాగా 125 మంది గైర్హాజరయ్యారు. పోటీలకు వచ్చిన అభ్యర్థులకు మొదట సర్టిఫికెట్ పరిశీలించి ఆ తర్వాత పరుగు పోటీ నిర్వహించారు. ఇందులో 1,053మంది అర్హత సాధించగా 289 మంది అర్హత పొందలేదు. ఆ తర్వాత చేపట్టిన ఎత్తు పరీక్షలో 992, లాంగ్‌జంప్‌లో 962, ఆ తర్వాత చివరగా నిర్వహించిన షాట్‌పుట్‌లో 916 మంది అర్హత పొందారు. ఇప్పటి వరకు జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో శనివారం ఎక్కువ సంఖ్యలో 426 మంది అర్హత పొందకపోవడం విశేషం.

ఇంట్లో చోరీ

అచ్చంపేట రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం విరగ్గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని హాజీపూర్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పద్మ, కుటుంబ సభ్యులు శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగ్గొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.70వేలు తీసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి గమనించారు. శనివారం అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: చింతకాయల కోసం చెట్టు ఎక్కిన వ్యక్తి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లికి చెందిన ఆంజనేయులు(46) పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ వసతి గృహంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం యూనివర్సిటీ ఆవరణలో ఉన్న చెట్టు ఎక్కి చింతకాయలు తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఘటన స్థలాన్ని రూరల్ పోలీసులు సందర్శించి మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బహిర్భూమికి వెళ్లి శవమై..

బిజినేపల్లి : మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన దాసరి మల్లేష్ (42) బుధవారం అర్ధరాత్రి బహిర్భూమికి ఇంటి నుంచి వెళ్లి స్థానిక కేఎల్ఐ కాల్వలో శవమై కన్పించాడు. ఎస్సై కృష్ణా ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్లిన భర్త ఎంతకూ రాకపోవడంతో శనివారం బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపడుతుండగా శనివారం మధ్యాహ్నం వట్టెం గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాల్వ వద్ద మల్లేష్ శవమై కన్పించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మల్లేష్ మృతదేహాన్ని బయటికి తీయించి, పంచనామా నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కేజీబీవీ విద్యార్థులకు బొబ్బలు



విద్యార్థినులను పరీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డా. రవిశంకర్

- కీటకాలు కరవడంతోనే..

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీలోని 20మంది విద్యార్థినులకు బొబ్బలు వచ్చాయి. ఏరియా ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పరిశీలించి డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడికి సమాచారమిచ్చారు. విషయన్ని శనివారం ఆస్పత్రికి వచ్చిన డీఎంహెచ్ఓ డా. రవిశంకర్‌కు తెలుపగా వెంటనే పాఠశాలకు చేరుకొని విద్యార్థినులను పరిశీలించారు. వైద్య శిబిరం ఏర్పాటుచేసి చికిత్స అందించాలని ఆత్మకూర్ ఆస్పత్రి వైద్యుడు డా. లక్ష్మణ్ పటేల్‌ను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. తరగతి గదుల్లోని కిటికీలకు సన్నటి జాలీ లేకపోవడంతో చుట్టూ ఉన్న పంట పొలాల నుంచి కీటకాలు వస్తున్నాయని.. వీటి కాటుతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు గుర్తించామని తెలిపారు. లైట్ పురుగులు కరవడంతోనే బొబ్బలు వచ్చి పగిలి ఇన్‌ఫెక్షన్ అయిందన్నారు. పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలోని ఏఎన్ఎంలు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ సమస్య తీవ్రంగా ఉండే పీహెచ్‌సీని సంప్రదించాలని సూచించారు. ఏరియా ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లు వారంలో రెండు పర్యాయలు పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని అధికారులకు విన్నవించాలన్నారు. డీఎంహెచ్ఓ వెంట హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, సీఆర్టీలు ఉన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పీయూ జట్టు



బెంగళూరు బయలుదేరుతున్న పీయూ జట్టుతో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జనవరి 2 నుంచి 5 వరకు బెంగళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో టేబుల్‌టెన్నిస్‌లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ జట్టు శుక్రవారం ప్రయాణమైంది. ఈ మేరకు జట్టు సభ్యులను పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు. తమకు వచ్చిన మంచి అవకాశాన్ని వినియోగించుకుని, ఆటల్లో మంచి ప్రతిభ కనబర్చి, పీయూకు కప్ సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి ట్రాక్‌సూట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పీడీ బాల్‌రాజ్, విష్ణువర్ధన్ రెడ్డి, కథలప్ప, జట్టు సభ్యులు మహేష్, వంశీ, సాయికృష్ణ, రాజు, కె. మహేష్ పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో పోలీసులు

గట్టు: రాష్ట్ర సరిహద్దుల్లోని బల్గెర చెక్ పోస్టు దగ్గర అక్రమంగా గోవా నుంచి తరలిస్తున్న మద్యాన్ని గద్వాల ఎక్సైజ్ అధికారులు శనివారం ఉదయం పట్టుకున్నారు. గద్వాల ఎక్సైజ్ సీఐ గోపాల్ కథనం మేరకు వివరాలిలా.. గోవా రాష్ట్రం నుంచి కర్ణాటక, తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలకు ముగ్గురు వ్యక్తులు మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా బల్గెర చెక్‌పోస్టు దగ్గర తనిఖీల్లో మద్యాన్ని పట్టుకున్నారు. డీటీఎఫ్ గద్వాల, గద్వాల, అలంపూర్ ఎస్ఐలతో కూడిన ప్రత్యేక బృందం సభ్యులు బల్గెర దగ్గర తనిఖీలు నిర్వహించగా.. 108 విస్కీ బాటిళ్లు, 25 రాయల్ చాలెంజ్, 5 బ్లెండర్ స్ప్రైడ్, 5 ఐబీ విస్కీ బాటిళ్లు తదితరవి పట్టుకున్నారు. ప్రకాశం జిల్లా ముండ్లమూర్‌కు చెందిన మెదరమట్ల అనికుమార్, మెదరమట్ల నరేంద్ర కుమార్, నంద్యాల జిల్లా చినరాజుపాలెంకు చెందిన హుస్సేన్‌బాషల నుంచి గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పటేల్‌బానోతు, మోహన్, రాజేందర్, గోవర్దన్, హరి, కానిస్టేబుళ్ల రవి, నాయుడు, షబ్బీర్, హరిప్రసాద్, నవీన్, గోవిందు పాల్గొన్నట్లు సీఐ గోపాల్ తెలిపారు.